# చురుకైన అబ్బాయి

నాకేసి జాలిగానూ, చీదరింపుతోనూ చూశాడు.

"మీ ముసలాళ్లు మీకే అన్నీ తెలుసనుకుంటారు. నిజం చూస్తే మీకన్న మాకే ఎక్కువ తెలుసు" అన్నాడు చురుకైన కుర్రాడు.

"ఎందువల్లను?" అన్నాను.

"మీరు పెద్దవాళ్ళూ, మేం చిన్నవాళ్ళమూ గనక."

"మేమూ ఒకప్పుడు చిన్నవాళ్ళమేగా?" అన్నాను.

"అప్పుడు మీకు మీ ముసలాళ్ళకన్న ఎక్కువ తెలుసేమో?"

"ఆయేటి కాయేడు మీదపడ్డకొద్దీ తెలిసింది కాస్తా హరించిపోతుందా ఏమిటి?"

"తెలియటానికి అనుభవంతో ఏమీ సంబంధం లేదు. పెద్దయినకొద్దీ మీరు దొంగవాళ్ళుగా తయారై మా కుర్రవాళ్ళని మోసం చెయ్యటానికే ప్రయత్నిస్తారు. ఏ పాతికేళ్ళో రాగానే మీరు చచ్చిపోతే ప్రపంచం ఎంతో బాగవుతుంది."

చురుకైన కుర్రాడి అంచనా ప్రకారం నేను చచ్చిపోయే అర్హత సంపాదించి ఓ పుష్కరం అయింది.

"పాతికేళ్ళు నిండితే నువేం చేస్తావు?" అన్నాను.

కుర్రాడి మొహం చూస్తే, అడగరాని ప్రశ్న అడిగినట్టు తోచింది.

"ముసలాణ్ణి కాకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. చేతకాకపోతే చచ్చిపోతాను."

కుర్రాడి ధైర్యసాహసాలకి లోటు లేనట్లు కనిపించింది. నాకంటె నయమే. నాకింకా చావాలని లేనేలేదు.

విషయం మార్చాను.

"నీ కన్నివిషయాలూ తెలుసునా?" అన్నాను.

"ఓ!" అన్నాడు కుర్రాడు.

నిట్టూర్చి, "ఎంత అదృష్టం! ఎప్పుడు నేర్చుకున్నావు?" అన్నాను.

---

*కొడవటిగంటి కుటుంబరావు*

కుర్రాడు మరింత అసహ్యంగా నాకేసి చూసి, "మీ ముసలాళ్ళకు ఎంత చెప్పినా తలకెక్కదు. ఈ విషయాలు నేర్చుకుంటే రావు. అవి తెలియవలసిందే," అన్నాడు.

"ఎట్లా తెలుస్తాయ్?" అన్నాను.

"తలకాయ ఉంటేసరి," అన్నాడు కుర్రాడు.

"తలకాయ ఉన్నంత మాత్రానికే అన్వేషించకుండా, పరిశోధించకుండా నిజం తెలుస్తుందా?" అన్నాను.

కుర్రాడు వింతగా, "నిజ మేమిటి?" అని అడిగాడు.

నిజమంటే ఏమిటో చెప్పటానికి కూడా నాకు తెలివితేటలు లేవనేని బయటపడింది. నేను ఏడువుకుంటూ, "ప్రత్యక్షానుభవం వెనకవుండే సత్యం!" అన్నాను.

"అటువంటి దేమీ లేదు," అన్నాడు కుర్రాడు.

"మరి సిద్ధాంతా లెట్లా చేస్తాం?" అన్నాను.

"ఏం సిద్ధాంతాలు?" అన్నాడు కుర్రాడు తిరస్కారంగా.

"సిద్ధాంతాలకేం బోలెడన్ని ఉన్నై. భూమి గుండ్రంగా - నారింజపండులాగుందని ఒక సిద్ధాంతం. భూమీ ఇతర గ్రహాలూ సూర్యుడిచుట్టూ తిరుగుతున్నాయని మరో సిద్ధాంతం. శాస్త్రజ్ఞులు చాలా సిద్ధాంతాలు చేశారు. రాజనీతిజ్ఞులు కూడా అనేక సిద్ధాంతాలు చేశారు. ఎంతో పరిశోధన చేసి, ఎంతమంది జుట్లో నెరిస్తేనేగాని ఈ సత్యాలు బైట పడలేదు."

"వొట్టిది! అన్నీ అబద్ధాలు! పచ్చి పంచస! శాస్త్రజ్ఞు లయేదీ, రాజనీతిజ్ఞులయేదీ, ఎవరికిష్టమైన విషయాలు వాళ్ళు నమ్ముతారు. ఎవరి అభిరుచి వారిదీ. భూమి గుండ్రంగా లేదని నాకు తెలుసు. సూర్యుడే భూమిచుట్టూ తిరుగుతున్నాడు. నా యిష్టం నాది!"

"శాస్త్రజ్ఞులు చేసిన కృషి యావత్తూ వృధాయే?"

"ఉష్కదండగ."

మళ్ళీ నాకు గోడ అడ్డయింది. పక్కకు తిరిగాను.


"పోనీ. నువ్వు చెప్పినట్టే అనుకుందాం. ఎవరి యిష్టం వచ్చినట్టు వాళ్ళనుకునేపక్షంలో, అభిప్రాయభేదం వస్తే ఎవరి అభిప్రాయం సరియైనట్టు? ఎవరిది తప్పయినట్టు?"

"ఎవరి అభిప్రాయం వాళ్ళకు రైటు."

"మా ముసలాళ్ళు తెలివితక్కువవారన్నావే? మా అభిప్రాయాలు మీకు రైటేగా?"

"కావలిస్తే అట్లానే అనుకోవచ్చు. మీ అభిప్రాయాలు తప్పని మా కుర్రాళ్ళకి తెలుసుగా?"

"నేను అనుకునేదానికన్న నువ్వను




కునేది ఎక్కువ నిజమని నీ అభిప్రాయం. అవునా, కాదా ?"

"అవును," అన్నాడు కుర్రాడు.

"అయితే నిజమంటే ఏమిటి ?'' కుర్రాడు చిక్కాడనుకున్నాను.

"నే ననుకునేది !" అన్నాడు కుర్రాడు.

"నే ననుకునేదే నిజమని నేనూ అంటాను. ఇన్నిరకాల నిజానికి ప్రపంచంలో స్థాన ముందా ?"

"లేనప్పుడు మాతో ఏకీభవించని వాళ్ళని చంపేసి, మా నిజమే చలామణిలో ఉంచుతాం."

అదీ సబబుగానే వుంది.

"మా ముసలాళ్ళతో అభిప్రాయ భేదాలు వస్తే మమ్మల్ని చంపేస్తావు ? బాగానే వుంది; మీ సాటికుర్రాళ్ళతోనే అభిప్రాయభేదం వస్తే ?''

"వాళ్ళనీ పాతేస్తాం. మీ ముసలాళ్ళ మాటలు విని చెడిపోయ్యేకుర్రా ళ్ళుండ రనా ?"

"ఏమాట వింటే బాగుపడేటట్టూ - నీమాట వినకపోతే చెడిపోయినట్టూనా?"

"నా దృష్టిలో అంతేగా ?''

"ఇంతమందిని చంపెయ్యాలంటే నీకు కొంతమందయినా మద్దత్తుండాలిగా; మీ సమాజానికి నాయకు డెవరు ? ఇంతమందిలో ఎవరి అభిప్రాయాలు

ఆమోదించాలో నీ కెట్లా తెలుస్తుంది ?" అన్నాను.

"వాదస్తంగా మాట్లాడకు. నేనే నాయకుణ్ణి. నాతో ఏకీభవించిన వాళ్ళందరూ నాతో వచ్చేస్తారు.

"వాళ్ళు ఎక్కువమంది లేకపోతే?"

"ఎందుకుండరూ ?'' మొదట్లో ఓ పాతికమందిమి ఉన్నప్పటికీ ఒక్కొక్కరినీ అడలగొట్టి మాలో కలుపుకుంటాం. ఈ విధంగా ఎన్నిలక్షలమందిమైనా అవుతాం. అప్పుడు మా విశ్వాసాల కెవరూ ఎదురు చెప్పలేరు. చెప్పిన వాళ్ళని చంపేస్తాం."

"నువ్వంత బలవంతుడి వయ్యేలోపల మిగతావాళ్ళు మీ అభిప్రాయాలు ప్రచారం చేయకుండా అడ్డుపడితే ?"

"ఏమిటీ ? నా అభిప్రాయాలు నేను ప్రచారం చేసుకునే హక్కుకూడా నాకివ్వరా ?''

"నీకు డెమాక్రసీలో ఎంత విశ్వాసముంది !" అన్నాను.


"కొంతవరకూ డెమాక్రసీ మంచిదే. కొంతవరకూ ఏదైనా మంచిదే."

మరుక్షైన అబ్బాయి చెప్పిన అభిప్రాయాలన్నీ ఒక దండ గుచ్చాను.

"అయితే నీరకం నిజం అమల్లోకి రావాలంటే ముందు ముసలోళ్ళంతా ఆత్మహత్య చేసుకోవాలన్నమాట; ఆతరువాత స్వేచ్ఛగా లాఠీలతో నీ విశ్వాసాలను నువ్వు ప్రచారం చేసుకుంటూంటే, నీ బలం తన బలంకంటే హెచ్చిపొయ్యే వరకూ ప్రపంచం చూస్తూ ఊరుకోవాలన్నమాట; ఇట్లా లాఠీ ప్రయోగంతో సాధించిన ఐకమత్యంతో నీ మతం వారంతా కలిసి మీతో ఏకీభవించనివారందర్నీ హత్యచేసేసి, నిజంస్థాపించేస్తారన్నమాట ! అన్వేషణలూ, పరిశోధనలూ, తర్కమూ, అనుభవమూ, సిద్ధాంతాలూ, వాటి సంస్కరణా ఏమీ అవసరం లేదన్నమాట ! తెలివితేటలూ, నిజం తెలుసుకునేశక్తి, నీ ప్రపంచంలో పుట్టుకతోనే వస్తాయన్నమాట; ఈ ప్రపంచాని కంతకీ అధినాయకుడివి నువ్వన్నమాట ! నీతో ఏకీభవించలేనివారంతా ముసలితనం వచ్చిందని గుర్తించి, ఆత్మహత్యలు చేసుకోవాలన్నమాట !" అన్నాను.

"అందులో తప్పేముంది ? అందరూ నేచేసే ప్రత్నమే చేస్తున్నారు. అయితే వాళ్ళకి సరిఅయిన అభిప్రాయాలు లేక, పద్ధతులు లేక ఓడిపోతున్నారు. నేను జయిస్తాను. ప్రపంచాన్నంతా నా పాదాల కింద పెట్టి తొక్కేస్తాను," అన్నాడు.

నా కెపో ఆవేశం వచ్చినట్టయింది. అప్రయత్నంగా వాడిపీక పట్టుకుని, "వెధవా ! నిన్నిప్పుడు పీక నులిమేస్తే ఏంచేస్తావు ? నీ రాక్షసత్వమంతా బయట పెట్టుకోవటాని కిప్పుడే సాహసించటం నీ పొరపాటు; కొంతకాలం ఆగవలసింది !" అని వాడిపీక నొక్కెయ్యసాగాను.




"ముద్దాయి వీరయ్య సోమయ్య గొంతు పిసుకుతున్నప్పుడు మీ రేంచేస్తున్నారు?"
"నన్ను సాక్ష్యం వేసుకుంటారని భయంవేసి కళ్ళు మూసుకున్నాను సార్ !"

"నన్ను చంపుతావుట్రా, ముసలి పీనుగా; నీ చేతులు పడిపోనూ; చిన్న పిల్లవాణ్ణి చేసి నీ పిశాచబలం నామీద చూపిస్తావుట్రా ?" అని కుర్రాడు అరవ సాగాడు. నలుగురూ చేరారు. కుర్రాణ్ణి విడిపించారు. "నీ కేం పొయ్యేకాలం ? లేతవెధవని పట్టి గొంతు పిసుకుతావా ? నీకు పిల్లల్లేరా ?" అని అడిగారు.

కుర్రాడు నాకేసి గర్వంగా చూసి, మెడ తడుపుకుంటూ, "చూసుకో, నా తడాఖా ? ప్రపంచమంతా నాపక్ష ముంది. ఇందాకణ్ణుంచీ ప్రపంచం తరపున వకాల్తా తీసుకుని మహా పేలావు. ఇప్పుడు పేలు!" అంటూ ఠీవిగా నడిచి వెళ్ళిపోయినాడు.

చుట్టూ పోగయిన వాళ్ళలో నాకేసి చూసినవాళ్ళులేరు. అందరూ వాడు వెళ్ళిన దిక్కే చూస్తున్నారు. అందరి మొహాల మీదా ఆప్యాయంగా చిరునవ్వు తాండవిస్తున్నది.

"కుర్రా డెవరోగాని ఎంత ముద్దొస్తున్నాడు! అన్నదో ముసలితొక్కు."

"చాలా చురుకైన కుర్రాడు. ముందు ముందు పైకొస్తాడు!" అన్నాడు పళ్లులేని ముసలాయన.

పాముపిల్ల ప్రాణంతో తప్పించుకు పోయింది — అయితే ఏం ? నేనూ ఇంకా జీవించేఉన్నాను. నాదీ మొండి ప్రాణమే; ఇంతల్లో చావను ? ఈపాము నాకందేసరికి బాగా కోఱలు పెరిగి బుస కొడుతూ ఉంటుంది. నేను మంచి దుడ్డు కర్ర వెతుక్కోవాలి. చేతులతో పనికాదు.

— —